సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



టెట్ పరీక్షలకు ఏర్పాట్లు 8లో

వచ్చే నెల 3 నుంచి జరగనున్న టెట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు.



ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ

నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. 8లో



కృష్ణమయ్య జయంతి ఉత్సవాలు

సింహగిరిపై ఆదివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీకాంత కృష్ణమాచార్య జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8లో

కలియుగ దైవంతో క్షుద్ర రాజకీయాలా...

సనాతన ధర్మానికి కూటమి ప్రభుత్వం విఘాతం కలిగిస్తోంది. క్షుద్ర రాజకీయాలు, అబద్ధాలతో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పట్ల తీవ్ర అపచారం చేసింది. కల్తీ నెయ్యి ఆరోపణలుచేస్తూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాస్తవాలను పక్కదారి పట్టించింది. దీంతో జిల్లా ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు రగిలిపోతున్నారు. నిరంకుశపాలన ఎక్కువ కాలం సాగదని శాపనార్థాలు పెడుతున్నారు. చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు చేశారు.

- దేవుడిని రాజకీయాల్లోకి లాగడం అన్యాయం
- లడ్డు ప్రసాదంపై సీఎం చంద్రబాబు స్వార్థ రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు
- చంద్రబాబు పాప ప్రక్షాళన కోసం జిల్లా వ్యాప్తంగా పూజలు



పాడేరులో మోదకొండమ్మకు పూజలు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ రవిబాబు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు



వేంకటేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేసిన ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి,పాడేరు: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని రాజకీయాల్లోకి లాగడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న పాపపు ప్రచారాన్ని నిరసిస్తూ, పాప ప్రక్షాళనకు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రం పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు,ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు మోద కొండమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి, పూజలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వారంతా మోదమ్మను వేడుకున్నారు.ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతోనే లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వైభవం, ప్రతిష్టను దిగజార్చేందుకు కూటమి ప్రభుత్వం,సీఎం చంద్రబాబు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు.వాస్తవానికి లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని,భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. లడ్డూ ప్రసాదంపై చేసిన తప్పుడు వ్యాఖ్యలు,తప్పుడు ప్రచారాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలలో వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లకుండా డిక్లరేషన్ పేరుతో అడ్డుపడడం ప్రభుత్వానికి తగదన్నారు.

దేవుళ్లను రాజకీయ లబ్ధికి వాడుకున్నారు

సీనియర్ నేత,ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో దేవుళ్లను రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం ఇదే ప్రథమమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కొద్ది రోజుల నుంచి తప్పుడు వాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్,అధికారులు పొంతన లేకుండా మాట్లాడుతుండడాన్ని ప్రజలు గమనించారని, ఛీకొడుతున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై సీబీఐతో పాటు ఉన్నత న్యాయ స్థానం దర్యాప్తును తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోరుతుంటే, ముఖ్యమంత్రి విచారణ జరిపించేందుకు ముందుకు రాకపోవడం సమంజసం కాదన్నారు. లడ్డూ ప్రసాదానికి ప్రపంచ వ్యాప్తంగా అప్రతిష్టను తెచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు పాపం మూటగట్టుకున్నారని చెప్పారు.

తప్పుడు ఆరోపణలు తగవు

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మండిపడ్డారు. మోదకొండమ్మ ఆలయంలో, స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం వేంకటేశ్వర స్వామి విగ్రహానికి పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లడ్డూ ప్రసాదం విశిష్టతను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యాలు చేయడం అత్యంత బాధాకరమని చెప్పారు.కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆధారాలు లేని ఆరోపణలు చంద్రబాబు చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదకొండమ్మతల్లి ఆలయం, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో వేర్వేరుగా జరిగిన పూజా కార్యక్రమాల్లో జీకే వీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం,పార్టీ జిల్లా కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు,వంతాల రాంబాబు, బసవన్నదొర,ఎంపీటీసీ నరసింహమూర్తి,పార్టీ నాయకులు కన్నాపాత్రుడు, సూర్యనారాయణ, నాగేంద్ర, కొండాజీ, సుబ్రహ్మణ్యం,మహేష్ పాల్గొన్నారు.

బాబుకు ప్రాయశ్చిత్తం జరగాలి

ఎమ్మెల్యే మత్స్యలింగం



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పార్టీ నాయకులు

అరకులోయటౌన్: కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని తప్పుడు ప్రచారం చేసిన సీఎం చంద్రబాబుకు ప్రాయశ్చిత్తం జరగాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. పాప ప్రక్షాళన కోసం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యల కారణంగా ప్రజలకు కీడు జరగకుండా, పాపప్రక్షాళన కోసం ఇక్కడి ఆలయంలో పూజలు నిర్వహించి, 108 కొబ్బరి కాయలు కొట్టినట్టు చెప్పారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేందుకే చంద్రబాబు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, సర్పంచ్ సుష్మిత, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ఎంపీటీసీ శత్రుఘ్న, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, పార్టీ ముఖ్య నాయకులు బాలరాజు, జన్ని నర్సింగ్, స్వాభి రామూర్తి, రాంచందూర్, కిల్లో నొబో, ఎం.టి.ఆర్ సాంబ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే బాబు కల్తీ డ్రామా



టీటీడీ ఆలయంలో ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రంపచోడవరం: కలియుగదైవం వేంకటేశ్వర స్వామిని రాజకీయాలకు వాడుకోవడం సీఎం చంద్రబాబునాయుడు దిగజారుడు తనానికి నిదర్శనమని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు), రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. పాప ప్రక్షాళన కోసం రంపచోడవరం సమీపంలోని ఐ.పోలవరంలోని టీటీడీ ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐ.పోలవరం నుంచి కొండపైన టీటీడీ ఆలయం వరకు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా వెళ్లి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవుడితో రాజకీయ చేస్తున్న వారిని ఆ దేవదేవుడు శిక్షించాలని, ప్రజలకు కీడు జరగకూడదని, పాపాలు ప్రక్షాళన కావాలని తమఅధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పూజలు చేసినట్లు తెలిపారు.రాజకీయ దురుద్దేశంతోనే కల్తీ డ్రామా ఆడుతున్నారని, వచ్చిన నెయ్యి వాడలేదని, తిరిగి పంపడం జరిగిందని టీటీడీ ఈవో చెప్పినా, నెయ్యి వాడినట్లు, దానితో తయారు చేసిన లడ్డూలు ప్రజలు తిన్నట్లు సీఎం చంద్రబాబునాయుడు విష ప్రచారం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడంతో ప్రజలు తిరగబడతారన్న భయంతో టీటీడీని రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించా రు. చంద్రబాబునాయుడు కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలతో నిర్మించుకున్న అధికారం స్వామి వారికి ఆగ్రహానికి కూలుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ,గారపాటి మురళీ, పండా కుమారి, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు,ఎంపీపీ కుంజం మురళీ సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, వడగల ప్రసాద్, ఆనందరెడ్డి, ఎంపీటీసీలు కుంజం వంశీ, సాయిబాబా, పార్టీ నాయకులు జల్లేపల్లి రామన్నదొర, పండా రామకృష్ణదొర, శేఖర్, యెజ్జు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బాబు

రంపచోడవరం: గురుకుల విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ పి.బాబు సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక గురుకుల బాలిక కళాశాలను శనివారం ఆయన సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడారు. ఆహార పదార్థాలు, బోధన తీరు, మౌలిక సదుపాయాలను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య,వైద్యం కోసం అధిక మొత్తంలో ఖర్చు చేస్తోందని, అయినా ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. తక్షణమే గురుకుల కళాశాలలో మంచినీరు,మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. వ్యాధులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మేజిస్ట్రేట్ హెచ్చరించారు. తన వంతు సహాయంగా కళాశాల హాస్టల్ గదుల్లో ఏర్పాటు చేసేందుకు లైట్లను అందజేస్తానని చెప్పారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎస్ఈ జి.ఎన్.ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన 1104 యూనియన్ నాయకులు

సాక్షి,పాడేరు: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ జి.వి.ప్రసాద్ హామీ ఇచ్చారు. ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను పాడేరు డివిజన్ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సంఘం 1104 నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం తమ సమస్యలను ఎస్ఈకి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన రెండు,మూడు నెలల్లో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1104 యూనియన్ అధ్యక్ష,ఉపాధ్యక్ష,కార్యదర్శులు సింహాచలం,షాజహాన్,సంజీవ్,ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



చాపరాయి వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద పోలీసులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అరకు–పాడేరు రహదారిలో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు



కబడ్డీలో తలపడుతున్న బాలికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ అధికారులు, పీడీలు

సాక్షి,పాడేరు: స్థానిక తలారిసింగి పాఠశాల క్రీడా మైదానంలో పాడేరు నియోజకవర్గ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ తదితర పోటీలను శుక్రవారం ప్రారంభించారు. చివరి రోజు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్కూల్ గేమ్ ఫెడరేషన్ కన్వీనర్ వండలం కొండలరావు, నియోజకవర్గ స్థాయి పోటీల ఇన్‌చార్జి సత్యవతి, పీడీలు సింహాచలం, రాజులమ్మ, శివప్రసాద్‌లు పోటీలను పర్యవేక్షించారు.ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

కాఫీ, మిరియాల దిగుబడి పెంపునకు చర్యలు

గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబు



మోదాపల్లిలో కాఫీతోటలను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబు



మ్యూజియం నిర్మాణంపై ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబుకు వివరిస్తున్న అధికారులు

సాక్షి,పాడేరు: జిల్లాలో గిరిజన రైతులు సాగుచేస్తున్న కాఫీ,మిరియాల పంటల దిగుబడులు పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె.కన్నబాబు తెలిపారు. పాడేరు ప్రాంతంలో శనివారం ఆయన పర్యటించారు.మోదాపల్లిలో గిరిజన రైతులు సాగుచేస్తున్న కాఫీతోటలను పరిశీలించి, కాఫీ రైతు కొర్రా వెంకటరావుతో మాట్లాడారు. కాఫీ, మిరియాల సాగు ద్వారా ప్రతి ఏడాది వస్తున్న ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. బేబీపల్పర్లు, ట్రసర్లు, టార్పాలిన్లు మంజూరు చేయాలని కాఫీ రైతులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఆర్గానిక్ పద్ధతులతో సాగు చేస్తున్న అరకు కాఫీకి అంతర్జాతీయ ఖ్యాతి లభించిందన్నారు. అనంతరం కందమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న చర్మవ్యాధుల వైద్యశిబిరాన్ని పరిశీలించి, చర్మవ్యాధులతో బాధపడుతున్న బాలికలకు సబ్బులు, మందులను పంపిణీ చేశారు. 9వతరగతి విద్యార్థినులతో మాట్లాడి, వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, వంటగదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం పాడేరులోని వన్‌ధన్ వికాస కేంద్రంలో గిరిజన ఉత్పత్తులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్,ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్,పీహెచ్‌వో అశోక్,డీఆర్డీఏ పీడీ మురళీ,గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు,కాఫీ బోర్డు డీడీ రమేష్,గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజనీ,ఏఈ దుర్గాప్రసాద్,కాఫీ ఏఈవో అప్పలనాయుడు పాల్గొన్నారు.

మ్యూజియం నిర్మాణ పనులు వేగవంతం

చింతపల్లి: స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనుల వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కె.కన్నబాబు ఆదేశించారు. తాజంగి గ్రామంలో నిర్మాణంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణం పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్. ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్. ఎం. రాజు, డీఈ చాణక్య, ఏఈ యాద కిషోర్ పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు



ఏడుగురాళ్లపల్లిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లు




ఎటపాక మండలంలో వెలసిన పోస్టర్లు

చింతూరు: మండలంలోని రెండు ఏడుగురాళ్లపల్లి, కాటుకపల్లిలో గిరిజన అభ్యుదయ సంఘం పేరుతో మావోయిస్టులకు వ్యతిరేకంగా శనివారం పోస్టర్లు వెలిశాయి. మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి తీసుకొచ్చిన యంత్రాలను దగ్ధం చేయడం, మా కోసం తిరుగుతున్న బస్సులను నిలిపివేయడమే మీ ధ్యేయమా అంటూ ఆ పోస్టర్లలో పేర్కొన్నారు. విధ్వంసం పేరుతో మా అభివృద్ధి అడ్డుకోకండి అంటూ ఆ పోస్టర్లలో వారు విజ్ఞప్తి చేశారు.

ఎటపాక : మండంలోని బండిరేవు, లక్ష్మీపురం, నందిగామ, బాసవాగు తదితర గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం రాత్రి పోస్టర్లు వెలిశాయి. గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టుల వారోత్సవాలు మాకొద్దంటూ .. గిరిజన అభ్యుదయ సంఘం,అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేరుతో పోస్టర్లు అతికించారు.

25 కేసుల్లో సింహాచలం దేవస్థానానికి అనుకూలంగా తీర్పు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం భూములకు సంబంధించి 25 కేసుల్లో హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని లీగల్ సెక్షన్ ఏఈవో రమణమూర్తి తెలిపారు. దేవస్థానం ఆస్తులకు సంబంధించి 2014 నుంచి హైకోర్టులో వివిధ కేసులు నడుస్తున్నాయి. వీటిలో సీతమ్మధార పరిసర ప్రాంతాల్లోని బిట్లు బిట్లుగా ఉన్న ఎకరం స్థలానికి సంబంధించి సుమారు 13 కేసులు ఉన్నాయి. ఈ స్థలాల విలువ సుమారు రూ.30 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కేసుల్లో హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఏఈవో తెలిపారు.

వరద బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ

లవ్ ఆండ్ కేర్ మినిస్ట్రీస్ సాయంతో నిత్యావసర సరకులు, టెంట్ల పంపిణీ





చట్రాపల్లి, మాదిమల్లులో నిత్యావసర సరకులు అందజేస్తున్న లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఏసుపాదం, అరకు ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీచైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు/సీలేరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదునేందుకు వైఎస్సార్‌సీపీ సీపీ నడుంబిగించింది. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ సహకారంతో సేవ, వితరణ కార్యక్రమాలు చేపట్టారు. జీకే వీధి మండలంలోని అతిమారు మూల పంచాయతీలైన దారకొండ, గుమ్మిరేవుల, గాలికొండల పరిధిలోని మాదిమల్లు, నిమ్మచెట్టు, దారపురం, చట్రాపల్లి గ్రామాల్లో సుమారు 125 గిరిజన కుటుంబాలకు భారీ ఎత్తున నిత్యావసర సరకులు, దుస్తులు, దుప్పట్లు, రగ్గులు, టెంట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఏసుపాదం, అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం అందజేశారని ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్, ఇతర నాయకులు మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధిత గిరిజన కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వరదలు, వర్షాల కారణంగా పలు చోట్ల గిరిజనులు ఇళ్లు కోల్పోయారని, భారీ ఎత్తున ఆస్తి, పంట నష్టం జరిగిందని చెప్పారు. తాగునీటి వనరులు పూర్తి కలుషితమవడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. జిల్లా అధికారులు కనీస స్థాయిలో కూడా పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో బాధితులను అన్ని విధాల ఆదుకోవాలని లేని పక్షంలో బాధితులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి ఎంపీపీలు బోయిన కుమారి, కోరాబు అనుషదేవి, జీకే వీధి, చింతపల్లి జెడ్పీటీసీలు కిముడు శివరత్నం, పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్‌లు కమల, రాజు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి



విద్యార్థి మోహిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కొయ్యూరు: జిల్లా స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి జె.మోహిత్‌ను ప్రిన్సిపాల్ మోహన్, పీడీ శివాజీ, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. పాడేరులో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో మోహిత్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని పలువురు ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ నేతల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి

ఎటపాక: దివంగత ఎంపీటీసీ సభ్యుడు వర్స బాలకృష్ణ సంస్మరణ సభ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శనివారం రక్తదానం చేశారు. కన్నాయిగూడెం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ బాలకృష్ణ ఇటీవల హత్యకు గురయ్యారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా పార్టీ శ్రేణులు సంస్మరణ సభ ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యుడు బాలకృష్ణ మృతి పార్టీకి తీరనిలోటని ఆయన ప్రజాసేవలో ఎప్పుడు ముందుండేవారని గుర్తుచేశారు. జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు గొంగడి వెంకట్రామిరెడ్డి, అంజలి, కమలి, సర్పంచ్‌లు , నాయకులు దామెర్ల రేవతి, వెంకట్, శివ, రాంబాబు, వినయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి వాడినట్లు నిరూపించాలి

- నిజాలు నిగ్గుతేల్చేందుకు థర్డ్ పార్టీ విచారణ చేపట్టాలి
- మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్



ఎంవీపీ కాలనీ: పవిత్రమైన వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపించాలని మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. లాసన్స్ బే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన స్వార్థ రాజకీయాల కోసం వేంకటేశ్వరస్వామిని సీఎం చంద్రబాబు పణంగా పెట్టారని ఆరోపించారు. దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగి తన నీచ రాజకీయ విధానాన్ని మరోసారి బయటపెట్టుకున్నారని మండిపడ్డారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో చంద్రబాబే దోషి అన్నారు. టీటీడీ ఈవో ఒక పక్క కల్తీ నెయ్యి వాడలేదని చెబుతున్నా చంద్రబాబు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే ఈ వ్యవహారంపై థర్డ్ పార్టీ ఎంక్వయిరీ వేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేలకు లేఖలు రాయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వెంకన్న దర్శనానికి వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఆయన కార్యక్రమానికి అనుమతులు లేవంటూ పోలీసు విభాగంతో నోటీసులు పంపించడమేంటని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి నుంచి డిక్లరేషన్ కోరడమేంటన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో సైతం జగన్ శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తు చేశా రు. అప్పుడులేని డిక్లరేషన్ ప్రస్తావన ఇప్పుడు ఎందుకొచ్చిందని బొత్స ప్రశ్నించారు. ఇతర మతాల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకే సీఎం చంద్రబాబు ఈ తరహా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు.

శాంతికి విఘాతం కలగొద్దనే.. పర్యటన రద్దు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దనే ఉద్దేశంతోనే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి దర్శనాన్ని రద్దు చేసుకున్నారని బొత్స అన్నారు. చంద్రబాబు బీజేపీ నాయకులతో కలిసి కక్రపన్ని కొందరిని రెచ్చగొట్టి, స్వామీజీలను ఉసుగొల్పి జగన్ పర్యటన ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని భావించారన్నారు. ఈ నేపథ్యంలో శాంతికి విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో జగన్‌మోహన్ రెడ్డి తన పర్యటన రద్దు చేసుకున్నట్లు బొత్స వివరించారు. అయితే చంద్రబాబు నీచ రాజకీయానికి ప్రాయశ్చిత్తం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పార్టీ శ్రేణులు పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రూ.25 వేల కోట్లు తెచ్చారు

అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని, ఆ సంపదను ప్రజలకు పంచుతానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు 100 రోజుల పాలనలో రూ.25 వేల కోట్లు అప్పుచేశారని బొత్స ఆరోపించారు. రాష్ట్ర ప్రజల కోసం కనీసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయని చంద్రబాబు ఆ నిధులు ఏం చేశారని ప్రశ్నించారు. మార్కెట్‌లో నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ధరల నిలుపుదలకు కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ఊసేలేదన్న ఆయన తల్లికి వందనం, రైతు భరోసా ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాల కల్పన మాట దేవుడెరుగు స్టీల్ ప్లాంట్‌లో 4 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించే పక్రియ జరుగుతున్నా కనీసం కూటమి ప్రభుత్వం నోరెత్తడంలేదని ఆరోపించారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

‘తేలని పంచాయితీ’

- గడువు ముగిసినా కొనసాగుతున్న బదిలీల వ్యవహారం
- సిఫార్సులతో జాబితాలో మార్పులు,చేర్పులు!

మహారాణిపేట(విశాఖ): గడువు ముగిసినా బదిలీల ‘పంచాయితీ’ తేలలేదు. సిఫార్సులు, మామూళ్ల కారణంగా బదిలీల జాబితా సిద్ధం చేసినా ఇంతవరకు పోస్టింగ్‌లు ఇవ్వలేదు. జాబితాలో మార్పులు చేర్పులు చేస్తుండడంతో పంచాయితీ తెగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల గడువు ఈ నెల 22వ తేదీతో ముగిసింది. కానీ పంచాయతీ రాజ్ శాఖ మాత్రం ఇప్పటికీ ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

కొలిక్కిరాని వ్యవహారం

పంచాయతీరాజ్ శాఖలో అన్ని గ్రేడ్-1 నుంచి సబార్డినేటర్ల వరకు మొత్తం 468 మంది ఉన్నారు. ఉమ్మడి విశాఖలో వీరికి బదిలీ చేయాల్సి ఉంది. ఇప్పటికీ వరకు ఏ ఒక్కరికీ పోస్టింగ్ ఉత్తర్వులు అందకపోవడం గమనార్హం. బదిలీల గడువు ముగిసినప్పటికీ.. ఉత్తర్వులు ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీంతో ప్రస్తుతం ఎక్కడి వారు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. పంచాయతీరాజ్ బదిలీలపై శనివారం ‘సాక్షి’ కథనంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. ఆగమేఘాల మీద తుది జాబితాపై కసరత్తు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఉన్నతాధికారుల ఆగ్రహం

బదిలీల విషయంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తక్షణమే అందరికీ పోస్టింగ్ ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలుస్తోంది. పంచాయతీరాజ్ కార్యనిర్వహణాధికారులు, రూరల్ డెవలప్‌మెంటు అధికారులు 20 మందికి బదిలీలు జరిగాయని తెలిసింది. విశాఖ జిల్లాలో నలుగురు ఈవోఆర్‌డీలు, అల్లూరి జిల్లాలో ఇద్దరు, అనకాపల్లి జిల్లాలో 14 మందికి బదిలీ అయిందని అయితే శనివారం రాత్రి వరకు ఉత్తర్వులు అందజేయలేదని పలువురు ఈవోఆర్‌డీలు ‘సాక్షి’కి చెప్పారు.

టెట్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- అధికారులతో సమావేశమైన కలెక్టర్ హరేందిర ప్రసాద్
- అక్టోబర్ 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు
- జిల్లాలో హాజరుకానున్న 60,574 మంది అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న టెట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలోని ఒక కేంద్రంలో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రత్యేక అధికారులను, స్క్వాడ్ బృందాలను నియమించినట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 60,574 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ఫొటో లేని హాల్ టికెట్‌తో వచ్చే అభ్యర్థులను ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డును పరిశీలించి కేంద్రంలోకి అనుమతించాలన్నారు. దివ్యాంగులు కోసం పరీక్ష సమయానికి అదనంగా 50 నిముషాల కేటాయించాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో అనుమానాల నివృత్తి కోసం ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఎనిమిది మంది అరెస్ట్



పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తులు



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు

అరకులోయ రూరల్ : ఒడిశా నుండి అరకులోయ మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 8 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. స్థానిక బొంపి జంక్షన్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు పటుబడిన్నట్లు అరకులోయ సీఐ ఎల్. హిమగిరి తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ. 48 వేలు ఉంటుదన్నారు.

పట్టుబడిన వారిలో ఒడిశా పాడువకు చెందిన రఘురాం సుంక్రి, మనోమజ్జి, తమిళనాడుకు చెందిన కమలేష్, ఆనుభువ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ తనిఖీల్లో రామ్మూర్తి, విశ్వనాథం, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: గంగవరం గ్రామశివారు నెమలి చెట్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు మహిళలతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్టు అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్సై భూషణం తెలిపారు. పూల వెంకటమ్మ, మల్లెల రాజమ్మ, ఆవుల రవి, కస్తి నాగుభూషణంను అరెస్టు చేసి వీరి నుంచి 187 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిని విలువ రూ. 9లక్షలు ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

సాక్షి,పాడేరు: నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్లాస్టిక్ నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పాడేరు వీధుల్లో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. విద్యార్థులంతా సుమారు 88కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఇందిరా గాంధీ జాతీయ సేవా పథకం రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఆర్.లీలా ప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రసూల్, ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ రమేష్‌బాబు, గణేష్, దామోదర్, గౌరిశంకరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలయిన సాయి

ఎటపాక: మండల పరిధిలోని బుట్టాయిగూడెం వద్ద బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ గ్రామానికి చెందిన సూదిపాక సాయి తన ద్విచక్ర వాహనంపై భద్రాచలం నుంచి నందిగామ వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద గుంతలో బైక్ పడడంతో అదుపు తప్పి పడ్డాడు. ఈ ప్రమాదంలో సాయి తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో సిబ్బంది ఆయనను నెల్లిపాక పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స అనంతరం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి కృష్ణమయ్య జయంతి ఉత్సవాలు

సింహాచలం(విశాఖ): సింహగిరిపై ఆదివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిపై కృష్ణమయ్య చాతుర్లక్ష వచన సంకీర్తనలు రచించారని, ఏటా భాద్రపద చతుర్దశిరోజు కృష్ణమయ్య జయంతిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై కృష్ణమయ్య పటం ఆవిష్కరణ, సాయంత్రం 4 గంటల నుంచి కృష్ణమయ్య సాహిత్య సంకీర్తనల నృత్య ప్రదర్శన, కోలాటం ఏర్పాటు చేశామన్నారు. 30న ఉదయం 10 గంటల నుంచి కృష్ణమయ్య సాహిత్య సంకీర్తనలు, సాయంత్రం 4 గంటల నుంచి నృత్య, కోలాటం ప్రదర్శనలు ఉంటాయన్నారు. అక్టోబరు 1న ఉదయం 9 గంటల నుంచి ఆలయ బేడా మండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద జయంతి పూజలు నిర్వహిస్తామని వివరించారు.

ఆక్రమణదారులకు నోటీసులు



నిబంధనలు అతిక్రమించి షాపులు నిర్మించిన దుకాణదారులకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పుట్‌పాత్, స్థలాన్ని ఆక్రమించి షాపులు నిర్మించిన దుకాణదారులకు ఆర్ఐ హరి ఆధ్వర్యంలో శనివారం నోటీసులు జారీ చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో దుకాణదారులు నష్టపోయిన ఆస్తికి సర్వే నిర్వహించి సంబంధిత శాఖాధికారులు పరిహారాన్ని అందజేశారు. అయితే కొందరు రహదారి స్థలంతో పాటు పుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయడంపై సంబంధిత అధికారులు రెవెన్యూ యంత్రాంగానికి నివేదికలు అందజేశారు. దీనిపై రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు స్పందించారు. ఈ మేరకు మూడు రోజుల్లో షాపులు తొలగించాలని ఆయా దుకాణదారులకు ఆదేశించి, నోటీసులు జారీ చేశారు.

నూతన సాంకేతికతతో పోలీసింగ్



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నూతన సాంకేతికతను వినియోగించుకొని పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శనివారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు. అనధికారిక డిపాజిట్లు, చీటీలు, ఫండ్‌లు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు, బాధితులకు న్యాయం చేసేందుకు నిందితుల ఆస్తులు జప్తు వంటి అంశాలపై అనుభవజ్ఞులైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో అవగాహన కల్పించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టీవ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలో అసాంఘిక కార్యకలాపాలను నివారించాలన్నారు. గంజాయి రవాణా, వినియోగంపై దృష్టి సారించాలన్నారు. రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ (క్రైమ్) కె.లతా మాధురి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.